ప్రజాశక్తి
సోమవారం 4 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

నేడు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం లేదని, దీన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

మెళియాపుట్టిలో నేడు గ్రీవెన్స్

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల శ్రీకాకుళం జిల్లా మెలియపుట్టిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించనున్నట్టు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటిడిఎలో ఎపిఒ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

తెల్ల బంగారం ధర పతనం

- ప్రకటనలకే పరిమితమైన మద్దతు ధర
- క్వింటాకు వెయ్యి రూపాయలు నష్టపోతున్న రైతులు
- ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి
- కాటన్ జిన్నింగ్ మిల్లుకు విక్రయించాలని అధికారుల సూచనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పత్తి రైతులు చిత్తవు తున్నారు. మద్ధతు ధర లభించక విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో క్వింటాకు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో ఏటా ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టేది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాలూరు ఎఎంసి యార్డులో సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే అవకాశం వుండేది. అయితే గత కొంతకాలంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా చేతులెత్తేసింది. దీంతో రైతులు అనివార్యంగా ప్రయివేటు వ్యాపారులకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో సాలూరు, పాచిపెంట, మక్కువ, కొమరాడ, పార్వతీపురం, బల్జిపేట, కురుపాం, పాలకొండ, సీతంపేట మండలాల్లో సుమారు 12వేల ఎకరాల్లో పత్తి సాగతువుంది. దిగుబడి సుమారు 20వేల క్వింటాళ్ల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అందని ద్రాక్ష లా మద్దతు ధర

పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందని ద్రాక్ష లా మారింది. పొడవు గింజ పత్తి క్వింటాలుకు రూ.7500, పొట్టి గింజ పత్తి రూ.7120కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కాటన్ కార్పొరేషన్ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాపారులు నాణ్యతపై రకరకాల కారణాలతో పత్తి క్వింటాకు రూ.6200 నుంచి రూ.6400 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది. రైతుల కాయకష్టం దళారుల బోజ్యం గా మారింది.

పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి

రైతులు ప్రస్తుతం పత్తి ఏరివేత పనుల్లో వున్నారు. మొదటి విడత ఏరివేత అయిన తరువాత అమ్ముకోవాల్సిన పరిస్థితి వుంది. ఎకరా పత్తి సాగుకు రైతులు సుమారు రూ.25వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దుక్కి నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు, పండించిన తర్వాత ఏరివేత, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎకరా భూమిలో నాలుగు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ధర ప్రకారం చూస్తే రైతులు పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మద్దతు ధర లభిస్తే ఎకరానికి రూ.5వేల నుంచి రూ.పదివేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధర లభించక పోతే తమ కష్టం దళారీల పాలయినట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాటన్ జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కు

రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస గ్రామంలో నందిని కాటన్ జిన్నింగ్ మిల్లు వుంది. గత కొన్నేళ్లుగా ఈ మిల్లు యాజమాన్యం పత్తి రైతులను అడ్డగోలుగా దోపిడీ చేస్తోంది. వ్యవసాయ, మార్కెటింగ్, సిసిఐ అధికారులు జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కై రైతులకు మద్దతు ధర అందకుండా చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు సాలూరు ఎఎంసి యార్డులో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేది. అయితే గత రెండేళ్లుగా సిసిఐ కొనుగోలు కేంద్రం జిన్నింగ్ మిల్లు వద్దనే ఏర్పాటు చేసి రైతులను దోపిడీకి గురి చేస్తోంది. మన్యం జిల్లాలో పత్తి సాగు చేస్తున్న సుదూర మండలాలైన పాలకొండ, సీతంపేట, భామిని, కొమరాడ, కురుపాం నుంచి కూడా పత్తిని జిన్నింగ్ మిల్లు వద్దకే తీసుకొచ్చి అమ్ముకోవాల్సిన పరిస్థితిని అధికారులు కల్పిస్తున్నారు. 50 నుంచి వంద కిలోమీటర్ల దూరం నుంచి పత్తిని రైతులు తీసుకురావడం కష్టమైన పనిగా భావిస్తున్నారు. దీంతో నష్టానికైనా వ్యాపారులకే తెగనమ్ముకొంటున్నారు. జిన్నింగ్ మిల్లు యజమాని కూడా కమిషన్ ఏజెంట్లను నియమించుకుని గ్రామాల్లో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

జిన్నింగ్ మిల్లు వద్ద అన్‌లోడింగ్‌లో భారీ క్యూలో ఉన్న వాహనాలు

మద్దతు ధర లేదు

నేను నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇప్పుడు ఏరివేసి అమ్మకానికి 15 క్వింటాళ్ల పత్తి సిద్ధంగా వుంచాను. ఎకరానికి పెట్టుబడి ఖర్చులు రూ.25వేల వరకు అయ్యాయి. మార్కెట్లో ధర క్వింటాలుకు రూ.6200 నుంచి 6400 వరకు పలుకుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసే నాధుడు లేరు. దిగుబడి అయిన పత్తిని ప్రయివేటు వ్యాపారులకు అమ్మలేక ఇంట్లో నిల్వ చేయలేక ఇబ్బంది పడుతున్నాను. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

కొర్రాయి సూర్యనారాయణ,
కూర్మరాజుపేట, సాలూరు మండలం

10లోగా కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రం సాలూరులో త్వరలో ప్రారంభిస్తాం. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చేతులు మీదుగా కేంద్రం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. భామినిలో కూడా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన పంపించాం. అవకాశాన్ని బట్టి సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎక్కడ నుంచైనా పత్తి రైతులు రామభద్రపురం మండలంలోని నందిని కాటన్ జిన్నింగ్ మిల్లుకే రవాణా చేయాలి.

గంగాధర్,
ఎడి, మార్కెటింగ్, పార్వతీపురం మన్యం జిల్లా

బహిరంగసభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

విద్యారంగం బలంగా ఉంటేనే పేదలకు మేలు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ విద్యారంగం బలంగా ఉన్నప్పుడే పేదలకు మేలు జరుగుతుందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు మహా ర్యాలీ నిర్వహించారు. తప్పెటగుళ్లు, కోలాటం, థింసా నృత్యాలతో ర్యాలీ సాగింది. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పోరాటాలే సమస్యలకు పరిష్కారమని నమ్మిన సంఘం యుటిఎఫ్ అని అన్నారు. విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 117తో విద్యారంగం నాశనమైందని చెప్పారు. ఇప్పుడున్న టిడిపి కూటమి ప్రభుత్వమైనా ఆ జీవోని సరిచేయాలని డిమాండ్ చేశారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల, ఉపాధ్యాయుల జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో కాంట్రాక్టీకరణ పెరుగుతోందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహన్ రావు, ఎస్.కిశోర్, ఆర్.మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు, సహాధ్యక్షులు బి.విజయ కుమార్, వి.జ్యోతి, డిప్యూటీ డిఇఒలు రాజ్ కుమార్, పిసిహెచ్.మోహనరావు, ఎంఇఒలు హాజరయ్యారు. జెఎసి చైర్మన్ జివిఆర్ కిశోర్, హెచ్ ఎంల సంఘం నాయకులు పిసి హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణంలో భారీ ర్యాలీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

థింసా నృత్యం చేస్తున్న ఉపాధ్యాయినిలు

అడలి వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పర్యాటకాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో టూరిజంలో భాగంగా పర్యాటక ప్రాంతాలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగతిపల్లి వ్యూ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం సున్నపుగెడ్డ జలపాతాన్ని సందర్శించారు. టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకొంటామని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా బత్తిన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా బత్తిన మోహన్‌రావు మళ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కోఆర్డినేటర్‌గా మళ్లీ తనకు అవకాశం ఇచ్చినందుకు అధ్యక్షులు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పూర్తిస్థాయిలో పనిచేస్తానని ఆయన ప్రకటనలో తెలిపారు.

పిసిసి అధ్యక్షురాలు షర్మిలతో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మోహనరావు

స్థానిక ఎమ్మెల్సీ మన్యం జిల్లాకేనా?

- ఎస్‌టికా? బిసిలకా?
- వైసిపి శ్రేణుల్లో చర్చనీయాంశమైన వైనం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లా రాజకీయాలలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సరికొత్త చర్చకు తెర రేపింది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో జరగనున్న మొదటి ఎన్నిక కావడం తో అధికార, ప్రతిపక్ష పార్టీల కు ప్రతిష్టాత్మకంగా మారనుంది. స్థానిక సంస్థల్లో బలాబలాలను బట్టి చూస్తే వైసిపికే ఆధిక్యం ఉంది. ఎంపిటిసి సభ్యులు, ఎంపిపి, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్ లు ఎక్కువమంది వైసిపి ఖాతాలోనే వున్నారు. ఈ నేపధ్యంలో వైసిపిలోనే అభ్యర్థికి డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయి. కొద్దినెలల క్రితం జరిగిన విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అధిష్టానం అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను చాకచక్యంగా ఎంపిక చేయడంతో ఆ పార్టీ కి అనుకూల ఫలితాన్నిచ్చింది. టిడిపి పోటీ నుంచి తప్పుకోవడం ద్వారా అలవోకగా ఎమ్మెల్సీగా బొత్స ఎన్నికవడం సాధ్యమయింది. అదే పరిస్థితి ఉమ్మడి విజయనగరం జిల్లా లోనూ కనిపిస్తోంది. శాసన మండలిలో విపక్షనేతగా వున్న బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే ఈ ఎమ్మెల్సీ సీటు కూడా వైసిపి సునాయాసంగా కైవసం చేసుకునే అవకాశం ఉంది. అయితే అభ్యర్థి ఎంపిక విషయంలో ఉమ్మడి జిల్లా పెద్దలు, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏకాభిప్రాయం తో వ్యవహరిస్తే గెలుపు నల్లేరుపై నడక అవుతుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

వైసిపి ప్రభుత్వం హయాంలో ఎస్.కోటకి చెందిన ఇందుకూరి రఘురాజును స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా ఎన్నుకున్నారు. అయితే గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే సీటు ఆశించిన ఎమ్మెల్సీ రఘురాజు తన సతీమణిని టిడిపిలోకి పంపారు. దీంతో ఆయన ని పార్టీ ఫిరాయింపుల కు పాల్పడ్డారని ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడింది. ఈ నేపధ్యంలో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక అనివార్యమైంది.

అభ్యర్థి ఎవనే దానిపై చర్చ

పాత విజయనగరం జిల్లాకు చెందిన తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న స్థానిక సంస్థల ప్రతినిధులంతా ఈ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉంది. పాత జిల్లా పరంగా చూస్తే విజయనగరం డివిజన్ నుంచి జెడ్‌పి చైర్మన్ గా మజ్జి శ్రీనివాసరావు వున్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. వీరిద్ద రూ విజయనగరం జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు.ఇద్దరూ కీలకమైన పదవుల్లో వున్నారు. కాబట్టి ఈసారి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని పార్వతీపురం డివిజన్‌కు కేటాయించే అవకాశం ఉంది. సాలూరు, పార్వతీపురం, కురుపాం, బొబ్బిలి నియోజకవర్గాల్లో బిసి, ఎస్టీ సామాజిక వర్గాలు బలంగా వున్నాయి. ఈ నాలుగు నియోజకవర్గాల్లో రెండు ఎస్టీ కేటగిరికి రిజర్వ్ చేయబడ్డాయి. బిసి లేదా గిరిజన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నాలుగు నియోజక వర్గాల్లో వైసిపికి బలమైన బిసి నాయకుడిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పల నాయుడు కనిపిస్తున్నారు. ఎస్టీ సామాజిక వర్గం నుంచి పరిశీలిస్తే మాజీ మంత్రులు పుష్పశ్రీవాణి, రాజన్నదొర ఉన్నారు. వీరిద్దరికీ పార్టీ అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయి. ప్రజావాణిని, పార్టీ వాణిని రానున్న రోజుల్లో బలంగా వినిపించగలిగే నాయకు డు ఎమ్మెల్సీ అభ్యర్థిగా వుండాలని వైసిపి నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. మన్యం జిల్లాలో అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే సంధ్యారాణి గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా వున్నారు. సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడును ఇంఛార్జి మంత్రిగా నియమించారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ వాణిని గట్టిగా వినిపించే నాయకుడిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దింపే అవకాశాలు కనినపిస్తున్నాయి.

అభ్యర్థి ఎంపికపై వైసిపి కసరత్తు

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో పోటీ చేసే అభ్యర్థి ఎంపిక పై వైసిపి కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ ముఖ్య నాయకులతో విధాన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో భేటీ అయ్యారు. వైసిపికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థి ఎంపిక పై బొత్స మాజీ ఎమ్మెల్యేలతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో పోటీకి అర్ధ బలం పుష్కలంగా వుండాలనే వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో ఎవరి స్తోమత ఏమిటని బొత్స ఆరా తీసినట్లు సమాచారం. ఈ భేటీకి మాజీ మంత్రి రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు హాజరయ్యారు.

జమిలీ ఎన్నికలను వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఒకే దేశం, ఒకే ఎన్నిక" - మోడీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపు నిచ్చారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను (జమిలి ఎన్నికలు జరగాలన్న రాంనాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులను) కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిందని తెలిపారు. ఇందులో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదని ఎందుకంటే మాజీ రాష్ట్రపతి నాయకత్వం వహించిన కమిటీ, హోం మంత్రి అమిత్ షా, ఇతర బిజెపి- ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుదారులతో కూడి ఉందని అన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు అన్న నినాదానికి ఇది కొనసాగింపు మాత్రమే. జమిలి ఎన్నికల వల్ల చాలా డబ్బు ఆదా అవుతుందని, పదేపదే ఎన్నికల వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలిగించడాన్ని నివారిస్తుందన్న బోసిపోయిన వాదనలను బిజెపి ముందుకు తెస్తోందని అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్‌కు పార్లమెంట్ కేటాయించిన సొమ్ము రూ.466 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా, సిబ్బంది తరలింపు తదితర అవసరాల కోసం మరికొంత సొమ్ము ఖర్చు చేశాయని, అన్ని కలిపినా ఇది ఏమంత పెద్ద ఖర్చు కాదని అన్నారు. ఇక అభివృద్ధికి వస్తే 1967 నుండి ఇప్పటి వరకు తరచూ ఎన్నికలు జరుగుతూనే వస్తున్నాయని, దీనివల్ల అభివృద్ధి గతిని నిరోధించినట్లు దాఖలాల్లేవని అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడానికి జమిలి ఎన్నికలు తేవాలన్న బిజెపి కృత్రిమ ప్రయత్నాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందని చెప్పారు. ప్రజాస్వామ్యం, బహుళత్వం, సమాఖ్య విధానాన్ని కోరుకునే ప్రతీ పార్టీ దీన్ని నిర్వంద్వంగా వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు. ఈ దుష్ట ప్రతిపాదనను ఐక్యంగా వమ్ము చేయాలని, ప్రజాస్వామ్య వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేకమైన ఈ ప్రతిపాదనను దేశ ప్రజానీకమంతా ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ ఉన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ టీచర్స్ ఎంప్లాయిస్ జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పథకాలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సదస్సు జిల్లా కన్వీనర్ బివి రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వాల తీరు మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఈ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన పాలకులు ఆ హామీని అమలు చేసే దిశగా ప్రయత్నించడంలేదని విమర్శించారు. నేటికీ అనేక ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగులకు, కార్మికులకు వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచోకాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర కన్వీనర్ బి.కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు నేటికీ పరిష్కారం కావడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సమగ్ర దృక్పథంతో ఆలోచించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సదస్సులో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల విజయనగరం జిల్లా నాయకులు జి అప్పలసూరి, పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు బి.ఈశ్వరరావు, రమేష్, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతరం జిల్లా నూతనకార్యావర్గం ఎన్నికైంది. కన్వీనర్‌గా బివి రమణ, కో-కన్వీనర్లుగా బి.ఈశ్వరరావు, టి.వెంకటరమణ, కమల, దేవిశ్రీ, పి.ప్రసాద్‌తో పాటు 20మంది కమిటీ సభ్యులను ఎన్నికయ్యారు. అనంతరం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై భవిష్యత్తులో పోరాట కార్యాచరణ రూపొందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ జెఎసి రాష్ట్ర చైర్మన్ నాగేశ్వరరావు

మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం

డిసెంబర్ 10, 11 తేదీల్లో నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో నిర్వహిస్తున్న సిపిఎం పదో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. మండలంలోని డి.బారామణిలో ఆదివారం మండంగి అడ్డమేశ్వరరావు అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ముందుగా మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల ఉద్యమాలు, పోరాటాలు సమీక్షించి ఉధృత పోరాటాలు నిర్వహించేందుకు సిపిఎం 10వ జిల్లా మహాసభలు గిరిజన రైతాంగ పోరాటల గడ్డ కురుపాం మండల కేంద్రంలో జరుగునున్న బహిరంగ సభకు పెద్దఎత్తున జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, మండంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు

కొబ్బరి తోటను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం, కారాడవలస, పెదబొండపల్లి రహదారికి ఆనుకుని ఉన్న రైతు దొగ్గ భానుమూర్తికి చెందిన 5 ఎకరాల కొబ్బరి తోటను శనివారం రాత్రి ఏనుగుల గుంపు ప్రవేశించి 250 మొక్కలకు పైగా ధ్వంసం చేశాయి. ఆదివారం తోటకు నీరు పెడదామా వచ్చిన రైతు ఏనుగులు చేసిన ధ్వంసాన్ని చూసి ఆందోళన వ్యక్తం చేశాడు. 20 రోజులకు పైగా మండలంలో ప్రవేశించిన ఏనుగుల గుంపు పలు పంటలతో పాటు కొబ్బరి తోటలను ధ్వంసం చేయడంతో పరిసర గ్రామ రైతులు పొలాల్లోకి వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అత్యవసర చర్యలు చేపట్టి ఏనుగులను తరలించాలని రైతులు కోరుకుంటున్నారు.

డిసెంబర్ 4న ప్రజా హక్కుల సభ

ప్రజాశక్తి - వీరఘట్టం

విజయవాడలో డిసెంబర్ 4న జరిగే ప్రజా హక్కుల ర్యాలీ, సభను జయప్రదం చేయాలని సిపిఐ ఎం.ఎల్ జిల్లా కార్యదర్శి పి భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చినగోరలో కరపత్రాలు ఆవిష్కరించారు. అలాగే ఈనెల 8న వీరఘట్టం కోదండరామ కళ్యాణమండపంలో జరుగు మన్యం జిల్లా పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర స్టాండింగ్ కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.విటలేశ్వర్ రావు, అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి.ఆదినారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జి.సూర్యారావు, బి.సోంబాబు, టి.శంకర్రావు, ఎం.సత్యం, కె.రమణ, బి.శ్రీరాములు, బి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గోరపాడుకు చెందిన బి.జానకికి పురిటి నొప్పులు వస్తున్నాయని ఆశా కార్యకర్త 108కి ఫోన్ చేసింది. సమాచారం అందుకున్న సీతంపేట 108 సిబ్బంది హుటాహుటిన గోరపాడుకు చేరుకున్నారు. అప్పటికే పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతున్న జానకిని 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా సీతంపేట సమీపానికి వచ్చేసరికి నొప్పులు ఎక్కువ కావడంతో ఇఎంటి రాములు, పైలెట్ రామారావు, ఆశా సహాయంతో సపర్యలు చేసి సులువుగా ప్రసవం చేశారు. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం స్థానికఏరియా హాస్పిటల్ లో చేర్పించారు. 108 సిబ్బంది చేసిన కృషికి జానకి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

గర్భిణికి ప్రసవ సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

గణిత ప్రతిభ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గణిత ప్రతిభ పరీక్షకు 185 మంది హాజరు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత (బాలుర) పాఠశాలలో ఆదివారం సిక్కోలు గణితం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షకు 8,9,10 తరగతులకు సంబంధించిన 185 మంది విద్యార్థులు హాజరైనట్టు నిర్వాహకులు బి.వి నాయుడు, ఎస్ సతీష్, జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రతిభా పరీక్షలో పదో తరగతి నుండి కెజిబివి విద్యార్థిని ఎం.శ్రీవిద్య, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.కుమారస్వామి, వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పి.జస్వంత్ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించినట్టు వారు తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతి తరగతి నుంచి ఎంపికైన ఏడుగురు విద్యార్థులను జిల్లా స్థాయిలో ఈనెల 17న పాలకొండలో జరుగు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. గణిత ప్రతిభా పరీక్ష విజయవంతంగా పూర్తి కావడానికి సహకరించిన మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

తుప్పల్లో నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జి

వృథాగా పడి ఉన్న వే బ్రిడ్జి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో లక్షలాది రూపాయలతో వెచ్చించిన వేబ్రిడ్జి మిషన్ వృథాగా పడి ఉంది. రైతులు పండించిన పంటను ఇక్కడ తూనిక వేసి ఆయా వ్యాపారులు జరిపిన రైస్ మిల్లులకు తరలించేవారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ వే బ్రిడ్జి మిషన్ పనిచేయకపోవడంతో రైతులు పాలిట శాపంగా మారింది. ఈ ఏడాదైన ఈ మిషన్ పని చేస్తారా? అలాగే మూలన పడుతుందా? అంటూ ఈ ప్రాంత రైతులు ప్రశ్నిస్తున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో పొదల తొలగింపు

ప్రజాశక్తి - సీతంపేట

మండలం లోని సీతంపేట నుంచి కుసిమి జంక్షన్ వరకు పోలీసుల ఆధ్వర్యంలో జెసిబి ద్వారా రోడ్డు పక్కన ఉన్న తుప్పలు డొంకలు ఆదివారం జంగిల్ క్లియరెన్స్ చేయించారు. రోడ్డు ప్రమాదాలు నివారణలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. రోడ్డు పక్కన మలుపుల వద్ద కనుచూపుమేర ఎదురుగా వస్తున్న వాహనం కనిపించాలని ఉద్దేశంతో వీటిని తొలగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్, హెచ్‌సి గురువయ్య, పి. రాము పాల్గొన్నారు.

రోడ్డు పక్కనున్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పోలీసులు

అక్షయపాత్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రెండో రోజు కొనసాగిన ఎస్ఎఫ్ఐ దీక్షలు • డివైఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

పౌష్టికాహారం విద్యార్థులకు అందటం లేదని, ఆహారం కల్తీ జరుగుతుందన్న కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలకు, వసతి గృహాలకు అక్షయ పాత్ర ద్వారా ఆహారం సరఫరా చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేపడుతున్న దీక్షలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు డివైఎఫ్ఐ, ఐలు జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ మాజీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ, నాయుడు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని, వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత వైసిపి, నేడు టిడిపి కూటమి ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయని విమర్శించారు.

రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల్లోనూ అనేక అడ్డంకులను షరతులుగా చేకూరుస్తున్నారని ఇది తీవ్రమైన అన్యాయమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 747 గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో 1.82 లక్షల మంది విద్యార్థులు ఉంటున్నారని, వీరికి హాస్టళ్లలో అప్పటికప్పుడు వేడివేడిగా వంట చేసి ఆహారం పెట్టినా సకాలంలో పౌష్టికాహారం అందడం లేదన్నారు. ఒక్క కేంద్రం నుంచి వీరికి అక్షయపాత్ర ద్వారా ఆహారం సరఫరా చేస్తే విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఇప్పటికే పౌష్టికాహారం అందక రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారని, మెనూ సక్రమంగా అమలు కావడం లేదని అధికారులు పర్యవేక్షణ లేదని అన్నారు. హాస్టళ్లలో వార్డెన్, వర్కర్లు, సిబ్బంది కొరత ఉందని, పదేళ్ల నుంచి నియామకాల్లేవని, హాస్టళ్ల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయింపులు కుడా పూర్తిగా లేవని వివరించారు. ఈ సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని వీటిని ప్రభుత్వం పరిష్కారం చేయకుండా అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహార సరఫరా చేయడమంటే ప్రభుత్వం తమ బాధ్యత నుండి తప్పుకోవడమేనని అన్నారు. ఇది విద్యార్థుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్య ధోరణిగా అర్థమౌతుందని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్, టి.అఖిల్, సురేష్, శివ, పి. రాజశేఖర్, నాయకులు శ్రీను, అంజి, చంటి, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి నష్టాన్ని గుర్తించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

తుఫాను వల్ల జరిగిన పత్తి నష్టాన్ని గుర్తించాలని, పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సంభవించిన తుఫాను మండలంలోని పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పత్తి నష్టాన్ని గుర్తించేలా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. అడపా దడపా వచ్చిన పత్తి కూడా అమ్ముకోవడానికి దళారీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కావున తక్షణమే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి వంద కేజీల పత్తి రూ.16 వేలకు కొనుగోలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మన్యం జిల్లాలో పత్తికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు రేగులపాడులో గ్రామసభ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడులో ఈనెల 4న భూరీసర్వే పరిష్కార గ్రామసభ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాటక పరిషత్ ప్రతినిధులు

8 నుంచి నాటక పరిషత్ పోటీలు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

మేరంగి నాటక పరిషత్ తెలుగు రాష్ట్రాల ద్వితీయ నాటక పోటీలను ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు రౌతు వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెదమేరంగి కూడలిలో గల సత్య కైలాస్ పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవ విలువలు, జరుగుతున్న రుగ్మతులను నాటికల ద్వారా ప్రదర్శించి ప్రజలను చైతన్యవంతులుగా చేసి యువత తప్పుదోవ పడకుండా మంచి మార్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నాటికలు ఎంతో దోహదపడతాయని అన్నారు. పూర్వం నుంచి ఈ కలల ద్వారా సాంప్రదాయాలు, దురాచారాలు వెలుగులోకి తెచ్చి ప్రజా క్షేత్రంలో మార్పుకై ఎంతో మంది కవులు, రచయితలు, కళాకారులు కృషి చేశారన్నారు. అయితే ప్రస్తుత సమాజంలో ఈ కళలకు ప్రాచుర్యం తగ్గించి ప్రజలు వినోదాలకే పరిమితమై పిచ్చి చేష్టలతో పండగలు, వేడుకల్లో శృంగార దృశ్యాలతో కలలను భ్రష్టు పట్టిస్తున్నారని ఇది సమాజానికి ఎంత మాత్రం మంచిది కాదని హితవుపలికారు. ఇలాంటి పరిస్థితుల్లో తాము నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక జిల్లాల నుంచి కళాకారులు వస్తారని తెలిపారు. ఈనెల 8 నుంచి జరుగు ఈ కార్యక్రమంలో రైతే రాజు, మమతా- మానవత్వమా, విముక్తి, ఎనిమిదో అడుగు, చివరిగా 10న మేరంగి వారిచే పులుసు నాటిక ప్రదర్శిస్తారని ఆయన తెలిపారు. ఈ నాటికలో రాష్ట్రస్థాయి ఉత్తమ నాటికను ఎంపిక చేస్తామన్నారు. ఇంతటి కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా గౌరవ ప్రజా ప్రతినిధులు ఆర్థిక సహాయ, సహకారాలు అందజేస్తు కళలను, కళాకారులను ప్రోత్సహించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రైతు విజయకుమార్, అజయ్ కుమార్, వాన నారాయణరావు, బలగ వెంకటరమణ, దాసరి శేషగిరిరావు, రాజేంద్ర కుమార్, గొట్టిపల్లి రామచంద్రరావు, వెలగాడ అన్నపూర్ణమ్మ, రాయిపల్లి మహేష్, మరడాన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ నారాయణరావు

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై నారాయణరావు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కిచ్చాడలో యువతకు సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువమంది మత్తు పానీయాలకు, మత్తు పదార్థాలకు బానిసలై రహదారి ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు వదులుకుంటున్నారని దీనివల్ల కుటుంబం చిన్న భిన్నం అయిపోతుందని అన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే యువతే కీలకమని, అటువంటి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడితే కుటుంబమంతా బాగుంటుందని అన్నారు. కావున యువత సక్రమార్గంలో ఉండి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

సీతానగరం : ప్రయాణికులకు వేగం కన్నా ప్రాణం మిన్నని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం ప్రయాణికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువకులు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో లాభాలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రైతులు ఏకపంట విధానాలు కాకుండా బహు పంటల విధానాన్ని పాటించినట్లయితే అధికాదాయాన్ని పొందుతారని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ లీడ్ ప్రకాష్ తెలిపారు. మండలంలోని మామిడిపల్లికి చెందిన రైతు సువ్వాడ గణేష్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో రైతులకు వ్యవసాయంలో విపరీతమైన పెట్టుబడులు పెరిగాయని, చీడ పురుగులు బెడదలు ఎక్కువగా ఉన్నాయని, వీటన్నింటి నుంచి విరమించుకొనేందుకు ౖతులు నిరంతరం వ్యవసాయంలో వచ్చే ఆధునిక విధానాలను అవలంబిస్తూ పదిమందికి ఆదర్శంగా నిలిచేలా సాగు చేస్తే అప్పుడే లాభాలు పొందగలరని పేర్కొన్నారు. సుమారు ఐదు ఎకరాల పామాయిల్ పంటలో వివిధ రకాలైన అంతర పంటలను వేసి లాభ పొందుతున్నారని, పూర్తిగా ఎరువులు రసాయనాలను నిలిపివేశారని దీని ద్వారా భూమి సారవంతమై పెట్టుబడులు కూడా తగ్గుతాయని అన్నారు. పామాయిల్, కొబ్బరి పంటల్లో బంతి, టమాటా, వంగ, మిరప, బొప్పాయి, కొమ్ము శెనగ అంతర్ పంటలుగా వేయువిధానం ఒక ప్రయోగాత్మకంగా చేశారని అన్నారు. రైతులు బహుళ పంటలు వేయడం వల్ల పంటల్లో జీవవైవిద్యం పెరుగుతుందని అన్నారు. పంట వేసిన 50 రోజులు వ్యవధిలో ఒక టమాటా మొక్కకు అర కిలో నుండి కేజి వరకు కాయలు రావడాని ప్రధాన కారణం ప్రతి పంటకు పంటకు మధ్య గాలి, వెలుతురు ధారాళంగా వెళ్లడం చీడ పీడలు నుండి రక్షణగా ఉండటమేనని అన్నారు. చీడపీడల నివారణకు పలు రకాల కషాయాలను స్థానిక గ్రోత్ ప్రమోటర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహాయం సలహాలతో రైతు తయారు చేసుకొని నిల్వ చేసుకోవడం వలన ఎప్పుడు అవసరమైతే అప్పుడు రైతు వద్ద కషయాలు అందుబాటులో వుంటాయని అన్నారు. అనంతరం రైతు గణేష్ మాట్లాడుతూ బంతి అంతర్ పంట వేయడం వల్ల రూ.30వేల వరకు ఆదాయము పొందానని తెలిపారు. ఎంసిఆర్ పివి తిరుపతి నాయుడు మాట్లాడుతూ బహుళపంటలు వేసే పద్ధతులను అలవర్చుకోవాలన్నారు. అనంతరం రబీ సీజన్లో సాగుకు అవసరమైన పంచగవ్య కషాయాన్ని తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మణ, సూరిబాబు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పార్టీ సభ్యత్వ నమోదును వేగంగా చేయాలని, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, సాధికార సారథులు భాగస్వాములు కావాలని రాష్ట్ర శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో సాలూరు పట్టణ, నాలుగు మండలాల క్లస్టర్, బూత్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడారు. సాలూరు నియోజకవర్గంలో నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జి, సాధికార సారథులు అందరూ పాల్గొని విజయవంతంగా 50 వేలు సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సాలూరు, మక్కువ, పాచిపెంట, మెంటాడ మండలాల టిడిపి అధ్యక్షులు ఆముదాల పారమేశ్, జి.వేణుగోపాల్, పి.ప్రసాద్ బాబు, చలుమూరి వెంకటరావు, క్లస్టర్, బూత్, సాధికారిక సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో టిడిపి సభ్యత నమోదు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మజ్జి వెంకటేష్ ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతుంది. పట్టణంలోని 4, 12 వార్డుల్లో ఆయా టిడిపి నాయకులతో కలిసి వార్డు ప్రజలకు సభ్యత్వ నమోదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగమైన ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని నాలుగు నెలల్లోనే ప్రజలకు అందిస్తున్నారన్నారు. వార్డుల్లో సిసి కాలువలు, రోడ్లు, విద్యుత్, కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తదితర సమస్యలను స్థానిక మహిళలు వెంకటేష్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పార్వతీపురంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న వెంకటేష్

వీరఘట్టం: గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకొండ నియోజకవర్గ టిడిపి బాధ్యులు పడాల భూదేవి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం వీరఘట్టంలో టిడిపి కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రణాళికా బద్ధంగా సభ్యత్వాలు నమోదు చేయాలనే కార్యకర్తలను సూచించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కండాపు వెంకటరమణమూర్తి, పోరెడ్డి వెంకటనాయుడు, ఎన్.భాస్కరరావు, జి.గజేంద్రనాయుడు, సాసుబిల్లి బుజ్జి, జంపు చంద్రశేఖర్, సుక్క శ్రీనివాసరావు, ముఖలింగం, పక్కి రవి, ఆంజనేయులు, ఎస్.నారాయణరావు, డి.లక్ష్మణరావు, అన్నంనాయుడు, రామకృష్ణ, వి.అప్పలరాజు, చింత సోంబాబు, ఎస్.సుదర్శనరావు, జీవరత్నం, రాజేష్, బాలకృష్ణ, నిఖిల్, సురేష్ తదితరలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌కు అధికారుల తూట్లు

ముసుగు వేయని వైఎస్ విగ్రహం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ కురుపాం మండలంలో మాత్రం అధికారులు ఎన్నికల కోడ్‌ను తుంగలో తొక్కారు. సాక్ష్యాత్తు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 2 నుండి డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కురుపాంలో అధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కారు అనడానికి నిదర్శనంగా మండల కేంద్రంలో గల వైయస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు కనీసం ముసుగులు తొడగని పరిస్థితి ఉంది. ఎన్నికల కమిషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభివృద్ధి పథకాలు సైతం ఆపివేసినప్పటికీ స్థానిక అధికారులు కనీసం విగ్రహాలకు ముసుగులు కూడా వేయకపోవడం ఎన్నికల నియమాలను అధికారులు తుంగలో తొక్కారని ప్రజలు విమర్శిస్తున్నారు.

ముసుగు వేయని ఎన్‌టిఆర్ విగ్రహం

అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు

ప్రజాశక్తి - సీతంపేట

అభివృద్ధికి అందనంత దూరాన ద్వారబందం, రంగంవలస గ్రామాలు ఉన్నాయని గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు, సహాయ కార్యదర్శి బి.సాయికుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. ఐటిడిఎలో నిత్యం గిరిజన అభివృద్ధిపై సమీక్షలు చేస్తున్నా నేటికీ అనేక గ్రామాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యానికి నోచుకోని పరిస్థితిలో మండలంలో అనేక గ్రామాలు ఉన్నాయన్నారు. 2004లో ఆర్భాటంగా అందరికీ ఇళ్లు మంజూరని హామీ ఇచ్చినా, కొద్ది మంది మాత్రమే నిర్మించకున్నారన్నారు. అనేక మందికి బిల్లులు మంజూరు కాకపోవడంతో వారి వద్ద డబ్బుల్లేక పునాది స్థాయిలోనే ఇళ్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిత్లీ, హుదూద్ తదితర తుపాన్లకు జీడి పంట పూర్తిగా దెబ్బ తినడంతో గిరిజనుల జీవనం కష్టంగా మారిందని అన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం బాధ్యత వహించి పునాది స్థాయిలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు కొనసాగించి, కనీస సౌకర్యాలైనా తాగునీరు, రోడ్లు తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పక్కా గృహాలకు నోచుకోని రంగంవలస

దీర్ఘకాలిక పెట్టుబడుల ద్వారా అధిక లాభాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

యుటిఐ మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ సిప్ ద్వారా దీర్ఘకాలిక పెట్టుబడులు మదుపరులకు అత్యధిక ఆర్థిక లాభాలు చేకూరుస్తున్నాయని యుటిఐ మ్యూచువల్ ఫండ్స్ ఎపిరీజనల్ మేనేజర్ ఆర్ శ్రీనివాసన్ అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్, మాజీ మున్సిపల్ కమిషనర్ దాసరి నర్సింగరావు ఆధ్వర్యంలో ఇన్వెస్టర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసన్ మాట్లాడుతూ ఆదాయం వచ్చే ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత మొత్తాన్ని తక్కువగా ప్రతినెల తమ బ్యాంకు ఖాతా ద్వారా క్రమానుగత పెట్టుబడుల విధానం ద్వారా పొదుపు చేసుకొని ఏక మొత్తంలో తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా విత్‌డ్రా చేసుకుని చక్కని పథకం సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ అని అన్నారు. స్థానిక ఫండ్ డిస్ట్రిబ్యూటర్ ద్వారా ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఐ మ్యూచువల్ ఫండ్ చీఫ్ మేనేజర్ పిళ్లా రామచంద్రరావు, సీనియర్ సహాయకులు పి.రవికుమార్ తదితరులు దృశ్య శ్రవణ విధానం ద్వారా పొదుపుపై అవగాహన కల్పించారు.

అందం... ఆహ్లాదం పర్యాటక ప్రాంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీలో పర్యాటక ప్రాంత అభివృద్ధి రూపొదిద్దుకుంటుంది. అందమైన ప్రకృతి సోయగాలు, జాలువారే జలపాతాలు చూసేందుకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. మండలంలో సవర కోటపాడు ఉద్యానవన నర్సరీ శిక్షణ కేంద్రంలో అడ్వెంచర్ పార్క్ ఎంతగానో ఆకట్టుకుంటుంది. బోటు షికారు, చిన్నపిల్లల పార్క్, విశ్రాంతి భవనాలు, అల్లూరి విగ్రహం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. తాడికొండ, మొగనాలి గెడ్డ జలపాతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందింది. జాలువారే జలపాతం చూసేందుకు శ్రీకాకుళం, పార్వతీపురం, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో వనభోజనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. పర్యాటకులతో ఈ ప్రాంతం కళకళలాడుతూ కనిపిస్తుంది.

తాడికొండలోని జలపాతం వద్ద సందడి చేస్తున్న చిన్నారులు